

ఉమ్మడి జిల్లాలో ఆరు కొవిడ్ కేసులు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: ఉమ్మడి జిల్లాలో కరోనా విజృంభిస్తోంది. పండుగ సెలవుల నేపథ్యంలో గురువారం జిల్లాలో ఆరు కరోనా కేసులు నమోదైనట్లు కర్నూలు జీజీహెచ్ కరోనా నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. అవుకు, కర్నూలు, బండిమెట్ట, ముజఫర్‌నగర్‌లో ఒక్కో కేసు నమోదు కాగా కర్నూలు మండల పరిధిలోని వెంగన్నబావి గ్రామంలో ఇద్దరు పిల్లలకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ జరిగింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో 23 కొవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నట్లు జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు.



వైసీపీకి గుడ్‌బై..!

- అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బ
- టీడీపీలో చేరిన విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి
- వైసీపీ కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి కూడా..
- అదే బాటలో మరో ఐదుగురు కార్పొరేటర్లు
- అధికార పార్టీలో అలజడి

కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. ఈ తరుణంలో అధికార పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. వైసీపీకి చెందిన కీలక నాయకులు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరుతున్నారు. దీంతో అధికార పార్టీలో అలజడి చెలరేగుతోంది. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అధినేత, సీఎం జగన్ సీట్లాటకు తెర తీశారు. సీటు రాదని తెలిసిన ప్రజాప్రతినిధులు, వైసీపీలో ప్రాధాన్యత దక్కని నాయకులు రాజీనామాల పర్వానికి తెర తీశారు. తాజా పరిణామాలతో వైసీపీలో కలకలం మొదలైంది. మరోసారి టికెట్ ఆశించిన కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్‌కు జగన్ మొండి చేయి చూపారు. దీంతో ఆయన వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. 24 గంటలు కూడా గడవకనే నగరంలో ప్రముఖ విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఆయన కుమార్తె వైసీపీ కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డి, అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధినేత కైప అశోక్ కుమార్‌రెడ్డిలు గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అదే బాటలో మరో ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు.

టీడీపీలో చేరిన కేవీ సుబ్బారెడ్డి ఫ్యామిలీ

కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు అశోక మహిళా ఇంజనీరింగ్ కైప అశోక్ కుమార్‌రెడ్డి, కుమార్తె 17వ వార్డు వైసీపీ కార్పొరేటర్ కైప పద్మలతారెడ్డిలు వైసీపీలో కీలక నాయకులుగా కొనసాగారు. అయినప్పటికీ వారి సేవలను వైసీపీ అధిష్ఠానం గుర్తించలేకపోయింది. దీంతో ఆ పార్టీలో ఇమడలేక కేవీ సుబ్బారెడ్డి కుటుంబం టీడీపీలో చేరిపోయింది. కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ కూడా వారి చేరికను స్వాగతించారు. దీంతో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలతో కలసి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు మంగళగిరికి చేరుకున్నారు. అక్కడ లోకేశ్‌ను కలిసి టీడీపీ కుండవాలు కప్పుకున్నారు. జిల్లాలో వైసీపీకి రాజీనామాలు.. టీడీపీలో వలసలు పెరగడంతో అధికార పార్టీ నాయకులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ కోసం సుబ్బారెడ్డి కుటుంబం పని చేసిందని అంటున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కేవీ సుబ్బారెడ్డి కుమార్తె కైప పద్మలతారెడ్డి 17వ వార్డు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. డిప్యూటీ మేయర్ పదవి ఆశ చూపి నిరాశకు గురి చేశారు. ఇదిలా ఉండగా కార్పొరేటర్ పద్మలతారెడ్డి బాటలోనే మరో ఆరుగురు కార్పొరేటర్లు కూడా ఉన్నట్లు సమాచారం. వారిలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఉన్నారు. వారిని ఆపేందుకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.


టీడీపీలో చేరుతున్న కేవీ సుబ్బారెడ్డి

ఎంపీ సంజీవ్ బాటలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు?



జిల్లాలో రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న తాజా ఎమ్మెల్యేలు ఒకరిద్దరు సీటు రాదని తెలిసి ఆ వైసీపీ గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. అయితే అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చి టికెట్ నిరాకరిస్తే అదే రోజు రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గత ఎన్నికల్లో రాజకీయ అరంగ్రేటం చేసిన చేనేత పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సంజీవ్‌కుమార్ కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఎన్నికల్లో ఖర్చులు, సీటు కోసం రూ.కోట్లు ఖర్చు చేశాడు. తీరా ఎంపీగా గెలిచాక ఆయా ఎమ్మెల్యేల అనుమతి లేకుండా ఏ నియోజకవర్గంలోకి వెళ్లకుండా సీఎం జగన్ రాజకీయ సంకెళ్లు వేశారు. రాబోయే ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నిస్తే సీఎం జగనే కాదు సీట్లాటలో కీలకంగా వ్యవహరించే సజ్జల, మిథున్‌రెడ్డి, ధనుంజయరెడ్డి వంటి వారు కూడా కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని ఎంపీ వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండానే పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిని మార్చడాన్ని సంజీవ్‌కుమార్ జీర్ణించుకోలేకపోయారు. మనస్థాపానికి గురై వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనను ఆపేందుకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య సహా సీనియర్ ఎమ్మెల్యే ఒకరు తీవ్ర ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇక ఎంపీ సంజీవ్‌కుమార్ బాటలో మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం. రేపో మాపో తాడేపల్లి ప్యాలెస్ నుంచి పిలుపు రాగానే వెళ్లి టికెట్ నిరాకరిస్తే అక్కడే రాజీనామా లేఖను ఇచ్చి వచ్చేందుకు సిద్ధమవుతున్నారట ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు. ఈ విషయం తెలిసిన వైసీపీ అధిష్ఠానం ఆ ఎమ్మెల్యేలు ఎవరు..? అనే సమాచారం రాబడుతోంది. ఇక టీడీపీలోకి వలసలు వెళ్లకుండా కట్టడి చేయాలని వైసీపీకి చెందిన కీలక నాయకులు పార్టీ అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని ఆ పార్టీకి చెందిన పలువురు చెబుతున్నారు. ఎన్నికలు జరిగేవరకూ ఎలాగోలా టీడీపీలోకి చేరికలను అడ్డుకోవాలని వైసీపీలోని పెద్దలు జిల్లా నేతలకు సూచిస్తున్నారని సమాచారం.

సమ్మె నోటీసులకు భయపడేది లేదు

31వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె


కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అన్నారు. శ్రీకృష్ణదేవరాలయ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు కోలాటం ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా అంగన్‌వాడీలపై ఇంత నిర్బంధాన్ని ప్రయోగించలేదని అన్నారు. అక్కచెల్లెమ్మలు అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ అక్క వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎంఎస్‌కేల ద్వారా అంగన్‌వాడీ సెంటర్లను నడపడం అసాధ్యమన్నారు. గత ప్రభుత్వాలకంటే జగన్ ప్రభుత్వమే అంగన్‌వాడీలను విపరీతమైన ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, సోమశ్వరి, ఉషా, వెంకమ్మ, కరుణమ్మ రేణుకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన స్వచ్ఛ ర్యాంక్

- 2 నుంచి 5కు వచ్చిన కర్నూలు
- దేశవ్యాప్తంగా 32వ స్థానం



కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: కర్నూలు నగర పాలక సంస్థను 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకు తీసుకు రావాలని అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎన్నో అవస్థలు పడ్డారు. నగరవాసుల నుంచి బలవంతంగా స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇప్పించినా రాష్ట్ర వ్యాప్తంగా రెండు స్థానాలు దిగజారి ఐదో ర్యాంకుతో కర్నూలు నగరం సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇక దేశవ్యాప్తంగా 32వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం జూలై ఒకటో తేదీ నుంచి స్వచ్ఛసర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ప్రారంభించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యాలయంలోని ఉద్యోగులతోపాటు వారి బంధువులు, స్నేహితులతో స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్స్ ఫీడ్ బ్యాక్‌ను చేయించారు. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో పారిశుధ్యం మెరుగుపడిందని ఫోన్ నెంబరును లాగిన్ చేసి ఆ నెంబరుకు ఓటీపీ రావడంతో దానిని సబ్మిట్ చేసి స్వచ్ఛ సర్వేక్షణ్ సిటిజన్స్ ఫీడ్‌బ్యాక్ చేశారు. 2022 సంవత్సరంలో నగర ప్రజల సహకారంతో కర్నూలు దేశవ్యాప్తంగా 179 నుంచి 55వ స్థాయి, రాష్ట్ర వ్యాప్తంగా 2వ స్థాయికి చేరింది. అయితే ప్రస్తుతం 2023 సంవత్సరానికి మొదటి స్థాయి రావాలని అధికారులు శ్రమించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 55 నుంచి 32కి, రాష్ట్ర వ్యాప్తంగా 2 నుంచి 5వ స్థానానికి వెళ్లింది. 1,50,000 మందితో ఫీడ్ బ్యాక్ చేయిస్తే మొదటి ర్యాంకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ఫలితం మాత్రం మరోలా వచ్చింది.

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు ,మీనాక్షినాయుడు ,తిక్కారెడ్డి

కోసిగి, జనవరి 11: వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందని ఇసుక, గ్రానైట్, మైనింగ్ పేరుతో వైసీపీ నాయకులు రూ.లక్షల కోట్ల దోపిడీ చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం జుమాలదిన్నెలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన టీడీపీ అధినేత పత్తికొండలో రా కదలిరా బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. ఈ బహిరంగా సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. జిల్లాలో అన్ని సీట్లు గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని అన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రంలో స్వర్ణయుగం తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి జగన్ అందర్నీ ముంచేశాడని విమర్శించారు. ప్రభుత్వ వేధింపులతో ఎన్నో కంపెనీలు పారిపోయాయని ఆరోపించారు. యువత భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ అని టీడీపీ-జనసేన జెండా పట్టుకుని ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే బాబు రావాలన్నారు.

మాతృమూర్తి స్వరూపమే జగన్మాత

- భక్తులను ఆదుకోవడానికే విభిన్న అవతారాలు
- ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు




హాజరైన ప్రజలు

కర్నూలు(కల్చరల్), జనవరి 11: మాతృమూర్తి స్వరూపమే జగన్మాత అని, తనను కొలిచే భక్తులను రక్షించేందుకు విభిన్న అవతారాలు దాలుస్తుందని ప్రముఖ ప్రవచన కర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. యువ ప్రజా నాయకుడు టీజీ భరత్ ఆధ్వర్యంలో, నగరంలోని ఎస్‌ఏపీ క్యాంపులోని టీజీ వెంకటేశ్ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన చాగంటి కోటేశ్వరరావు ప్రవచన బోధనల కార్యక్రమంలో రెండో రోజు గురువారం ఆయన 'జగన్మాత వైభవం' అనే అంశంపై ఆయన ప్రవచన బోధన చేశారు. సృష్టిలో సమస్త ప్రాణులకు జగన్మాత తల్లిరూపంలో కాపాడుతోందని, పరమ భాగవతాదులకు ఇబ్బందులు కలిగినప్పుడు ఆమె అనేక రూపాల్లో వచ్చి రక్షించిందని చెప్పారు. విశాలాక్షి, కామాక్షి, కనకదుర్గ ఇలా ఎన్ని పేర్లతో అవతారాలు దాల్చినా అవన్నీ లోక రక్షణకే అని పలు ఉదాహరణల మధ్య వివరించారు. భగవంతుడు, అమ్మవారు వేరు కాదని, దేవుడు శివుడు రూపంలో ఉంటే ఆమె పార్వతిగా, విష్ణురూపంలో ఉంటే లక్ష్మిగా, బ్రహ్మ రూపంలో ఉంటే సరస్వతిగా భగవంతుని వెంటే తానై నిలుస్తుందని చెప్పారు. భగవంతుడు దాల్చే వివిధ అవతారాలతోపాటు అమ్మవారి అవతారాలు కూడా నిరూపణ అయి, అది లోకానికి మేలు చేస్తుందని అన్నారు. పురుషుడు ఎంత గొప్పవాడైనా భార్య లేనిదే పుణ్యం సంపాదించుకోలేడని, దాంపత్య జీవితంలో భార్యాభర్తలు శరీరాలు వేరే కానీ మనసులు ఒక్కటై ఉంటాయని చెప్పారు. తల్లి బిడ్డ నుంచి ఏమీ ఆశించకుండా ఎలా ప్రేమను పంచుతుందో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు కూడా భక్తులైన తన పిల్లలను ప్రేమిస్తుందని, అమ్మవారు మాతృ మూర్తికి సమానమని చెప్పారు. జగన్మాతను ఆరాధించిన ఆదిశంకరాచార్యులు, భక్తపోతన, కాళిదాసు వంటి వారు రాసిన పద్యాలను వాటి అర్థాలను వివరించారు. అలాగే దేవీ భాగవతంలో అమ్మవారి గురించి వర్ణించిన విధానాన్ని భక్తులకు సోదాహరణల మధ్య తెలియజేశారు.

చాగంటి వారు అనుమతిస్తే కర్నూలులో ఆశ్రమం కట్టిస్తాం

ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ప్రారంభానికి ముందు యువ నాయకుడు టీజీ భరత్ మాట్లాడారు. చాగంటి కోటేశ్వరరావు అనుమతిస్తే ఆయనకు కర్నూలులో ఆశ్రమం కట్టిస్తామని అన్నారు. ఏడాదిలో ఒక నెలరోజులు కర్నూలులో ఉంటూ ధార్మిక ప్రవచన బోధనలు చేయాలని విన్నవించారు. ప్రవచన బోధన అనంతరం చాగంటి కోటేశ్వరరావు దంపతులను టీజీ భరత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

\- టీజీ భరత్

22న ఓటర్ల తుది జాబితా


కలెక్టర్ జి. సృజన

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 11 : ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22న విడుదలచేస్తున్నట్లు కలెక్టర్ డా.జి సృజన తెలిపారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే యువ ఓటర్లను అత్యధికంగా కర్నూలు జిల్లాలోనే నమోదు చేశామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ స్టేషన్‌లోనే ఉండేవిధంగా చర్యలుతీసుకోమని ఈఆర్‌ఓలకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఎన్నికల కమిషన్‌ఆదేశాల మేరకు ఫైనల్ ఓటర్ జాబితాలో డెత్ ఓటర్లు, అనమోలిస్ క్యారెక్టర్స్ లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లు జాబితా సవరణకు సంబంధించి మార్పులు చేర్పులు ఉంటే నిర్దేశించిన ఫారంలో బీఎల్‌ఓలతో వెంటనే దరఖాస్తు చేయించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదనరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌కు డబ్బులు ఇవ్వొద్దు

కర్నూలు(హస్పిటల్), జనవరి 11: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో రెగ్యులరైజేషన్ కోసం అర్హులైన ఉద్యోగులు డబ్బులు ఇవ్వవలసిన అవ సరం లేదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఏ ఉద్యోగి కూడా రెగ్యులరైజేషన్ పని నిమిత్తం కార్యాలయానికి రావలసిన అవసరం లేదని వెల్లడించారు. ఉద్యోగి పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో ఉన్న డ్రాయింగ్ ఆఫీసర్ వద్దనే వివరాలను అప్లోడ్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వారి అర్హత ప్రమాణాల ప్రకారం రెగ్యులరైజేషన్ చేస్తామన్నారు.



కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

నవరత్నాల రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



వెండి రథాన్ని లాగుతున్న సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు పూరీ ఆకాష్

మంత్రాలయం, జనవరి 11: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన గురువారం అమావాస్య శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. బెంగళూరుకు చెందిన భగీరథ అనే భక్తురాలు అన్నదానానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటకలోని అదమారు మఠం పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీ, ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు సినీనటుడు పూరీ ఆకాష్ గురువారం వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మఠం అధికారులు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. పూరీ ఆకాష్ వెండి రథం లాగి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం, అమావాస్య కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు.

కుమారుడి వద్దకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు

గడివేముల, జనవరి 11 : సంక్రాంతి పండుగను కుమారుడి వద్ద జరుపుకునేందుకు కుటుంబ సభ్యులతో వెళ్తున్న ఓ తల్లి రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిన హృదయ విదారక ఘటన గడివేములలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మిడ్తూరు మండలం చెరుకుచర్ల గ్రామానికి చెందిన కస్తూరయ్య, పద్మావతమ్మల కుమారుడు రాజలింగేశ్వరయ్య మహానంది దేవస్థానంలో అర్చకుడిగా పని చేస్తున్నాడు. సంక్రాతి పండుగ సందర్భంగా కుమారుడి వద్ద పండుగ చేసుకునేందుకు తల్లిదండ్రులు కస్తూరయ్య, పద్మావతమ్మతో పాటు మనుమరాలు త్రిపుర ద్విచక్ర వాహనంపై చెరుకుచర్ల నుంచి మహానందికి గురువారం బయలుదేరారు. గడివేములలోని సినిమా హాల్ సమీపంలోకి రాగానే బైక్‌ను భారీ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పద్మావతమ్మ(56) వాహనం టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. కస్తూరయ్య గాయాలపాలయ్యాడు. పద్మావతమ్మ కళ్లెదుటే మృత్యువాత పడడంతో భర్త కస్తూరయ్య విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకట సుబ్బయ్య తెలిపారు.

డిగ్రీలో 12 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 11: డిగ్రీ 3వ సెమిస్టర్‌లో 12 మంది డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3,830 మంది దరఖాస్తు చేసుకోగా 3,385 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

తమ్మడపల్లిలో రూ.3 లక్షలు చోరీ

మహానంది, జనవరి 11: మహానంది మండలం తమ్మడపల్లిలోని సోమన్న అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.3 లక్షల నగదుతో పాటు ఆరు తులాల బంగారు నగలు దోచుకెళ్లారని బాధితుడు సోమన్న తెలిపారు. తాము ఇంట్లో నిద్రిస్తుండగా దొంగతనం జరిగిందన్నాడు. గురువారం ఉదయం ఫిర్యాదు అందుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

కర్నూలు ఎంపీ అభ్యర్థిగా జయరాం

- వైసీపీ మూడో జాబితా విడుదల
- ఆలూరుకు చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్‌కు చెక్.. డాక్టర్ సతీశ్‌కు చాన్స్



కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నుంచి మంత్రి గుమ్మనూరు జయరాంను తప్పించి కర్నూలు ఎంపీగా ఛాన్స్ ఇచ్చారు. సీఎం జగన్ అడుదాం సీట్లాటలో కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌ను అవుట్ చేశారు. అక్కడ డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌కు అవకాశం ఇచ్చారు. జగన్ తీసుకున్న నిర్ణయంతో సుధాకర్ వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో రగలిపోతున్నారు. అదే క్రమంలో ఆలూరు సీటు వైరి వర్గానికి చెందిన చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షికి ఇచ్చి జయరాంకు ఎంపీ టికెట్ ఇవ్వడంపై మంత్రి వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటిస్తూ మూడు జాబితాలు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో కర్నూలు ఎంపీ, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు (ఎస్సీ) ఇన్‌చార్జిల (రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు)ను ఖరారు చేశారు. నంద్యాల లోక్‌సభ ఎంపీ సహా 11 నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. తెరపైకి కొత్తకొత్త వ్యక్తులు వస్తుండటంతో రాబోయే జాబితాలో మా పేరు ఉంటుందా..? సీఎం జగన్, సజ్జల, ధనుంజయ రెడ్డి, మిథున్‌రెడ్డిలు ఆడే సీట్లాటలో మా టికెట్ గల్లంతు అవుతుందా..? అనే టెన్షన్‌లో ఎమ్మెల్యేలు ఉన్నారు. అన్ని విధాలుగా క్లియర్‌గా ఉన్నప్పుడు మూడో జాబితాలో పేరు ఎందుకు లేదు..? అనే ప్రశ్న వారిని వేధిస్తోంది.

ఆలూరు నుంచి జయరాం అవుట్

ఆలూరు వైసీపీ టికెట్ కోసం మంత్రి గుమ్మనూరు జయరాం చివరి వరకు ప్రయత్నాలు సాగించారు. ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తనకు రాజకీయంగా వైరివర్గంగా ఎదుగుతున్న బి.విరుపాక్షినే ఎంపిక చేశారు. జయరాంకు జూన్ 19న చెప్పినట్లుగా కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జి (ఎంపీ అభ్యర్థి)గా ఎంపిక చేశారు. ఆలూరు టికెట్ ఇవ్వనందుకు బాధపడాలో.. ఎంపీ టికెట్ ఇచ్చినందుకు సంతోష పడాలో తెలియని పరిస్థితి జయరాం వర్గీయులది. అయితే తమకు ఆలూరు టికెట్ ఇవ్వనందుకు బాధలేదు కానీ... విరుపాక్షికి ఇవ్వడం నచ్చలేదని మంత్రి వర్గీయులు అంటున్నారు. మంత్రి జయరాం, ఆయన సోదరులకు మింగుడు పడడం లేదు. ఎలాగైనా విరుపాక్షికి టికెట్ రాకుండా అడ్డుకోవడానికి జయరాం శతవిధాల ప్రయత్నాలు చేశారు. ఈ నెల 5న సీఎం జగన్‌ను కలసిన మంత్రి జయరాం తనకు ఆలూరు టికెట్ ఇవ్వకపోయిన పర్వాలేదు.. ఆదోని ఉంటున్న వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు ఇవ్వండి గెలిపించుకు వస్తానని జగన్‌పై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది.

సుధాకర్ అవుట్.. సతీశ్ ఇన్



కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అవుట్ అయ్యారు. ఆ స్థానంలో కర్నూలు నగరం ఏ క్యాంపులో ఉన్న రాయలసీమ క్రిస్టియన్ కాలేజీస్ విద్యా సంస్థల అధినేత, డాక్టర్ ఆదిమూలపు సతీశ్‌కు అవకాశం ఇచ్చారు. కోడుమూరు వైసీపీ ఇన్‌చార్జిగా మూడో జాబితాలో స్థానం కల్పించారు. ఈయన సోదరుడు ఆదిమూలపు సురేశ్ జగన్ కేబినేట్‌లో మంత్రిగా కొనసాగుతున్నారు. కోడుమూరు నుంచి వైసీపీ టికెట్ కోసం తాజా ఎమ్మెల్యే సుధాకర్, మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, మురళీకృష్ణ తదితరులు ప్రయత్నించారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సిఫారసు మేరకు సీఎం జగన్ సతీశ్‌కు అవకాశం ఇవ్వడం కొసమెరుపు. సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా సతీశ్‌ను ఇన్‌చార్జిగా ఎంపిక చేయడంపై ఆయన వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

విరుపాక్షికి కలిసొచ్చిన అదృష్టం



చిప్పగిరి జడ్పీటీసీ బి.విరుపాక్షిని ఆలూరు నియోజకర్గం వైసీపీ ఇన్‌చార్జిగా నియమించారు. మంత్రి గుమ్మనూరు జయరాంతో రాజకీయ విభేదాలే ఆయనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చింది. జడ్పీటీసీగా ఆయనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇస్తూ రాజకీయ ఎదుగుదులకు ప్రోత్సహించి ఉంటే ఈ రోజుకు మంత్రి జయరాంను కాదని టికెట్ తెచ్చుకునే పరిస్థితి వచ్చేది కాదు. మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు విరుపాక్షిని రాజకీయంగా తొక్కిపెట్టాలనుకున్నారు.. అదే వేగంతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం జగన్ గుర్తించేలా ఎదిగారని ఆయన వర్గీయులు అంటున్నారు. బుధవారం సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి టికెట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ విషయం తెలిసి విరుపాక్షి వర్గీయులు ఆలూరు, చిప్పగిరిలో బాణసంచా పేల్చారు. ఇది నచ్చని మంత్రి వర్గీయులు వారిపై దాడి చేశారని విరుపాక్షి వర్గీయులు ఆరోపిస్తున్నారు. గురువారం మంత్రి జయరాం బంధువు శ్రీధర్, విరుపాక్షి వర్గీయుడు పెద్ద పెద్దయ్యల మధ్య ఇదే విషయంలో వాగ్వాదానికి దారితీసింది. ఇక్కడి నుంచి వైసీపీ టికెట్ కోసం దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి కుమార్తె ఎన్‌ఆర్‌ఐ పాటిల్ హిమవర్షిణిరెడ్డి, తెర్నేకల్లు సురేంద్రరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, టీడీపీని వీడి వైసీపీలో చేరిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ సహా పలువురు ప్రయత్నించినా చివరికి విరుపాక్షి వైపే జగన్ మొగ్గు చూపారు.

చంద్రబాబు సభలను విజయవతం చేద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 11: 'రా..కదలి రా' పిలుపుతో చంద్రబాబు నిర్వహిస్తున్న సభలను విజయవంతం చేయలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు పార్టీ శ్రేణులను కోరారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీటీ నాయుడు మాట్లాడారు. 2019 తర్వాత రాష్ట్రంలో అరాచక, అవినీతి, హత్యారాజకీయ, కూల్చివేతలు, దాడులు, రద్దులు, అక్రమాలతో జగన్ పాలన మొదలైందన్నారు. జగన్ మాదిరిగానే వైసీపీ నాయకులు, ఆ పార్టీ నుంచి నెగ్గిన ప్రజాప్రతినిధులు ప్రజా ఆస్తులను దోచేస్తున్నారని ఆరోపించారు. అప్రజాస్వామిక విధానాలను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్ని పార్లమెంట్ పరిధిలో 'రా..కదలిరా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ బహిరంగ సభలను విజయవతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాపాడి రాష్ట్రానికి స్వర్ణ యుగం తీసుకురావడమే టీడీపీ లక్ష్యమని బీటీ నాయుడు పేర్కొన్నారు.

నోటీసులకు భయపడేది లేదు

» 31వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



31వ సంఖ్య రూపంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గూడూరు జనవరి 10: షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. గురువారం అంగన్‌వాడీ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరింది. సమ్మెలో భాగాంగా అంగన్‌వాడీలు 31వ అంకెల రూపంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అరుణ, మద్దమ్మ మాట్లాడుతూ అంగన్ వాడీలు గత 31 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో రత్నమ్మ, అనంతమ్మ, సుజాత, మంజుల, సరోజమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేషన్ ఎదుట క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె గురువారానికి 26వ రోజు చేరింది. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మాట్లాడుతూ 26 రోజులుగా క్లాప్ ఆటోలను బంద్ చేసి నిరసనలు తెలిపినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నగరంలోని చెత్తను ఆటోలతో తరలిస్తూ ప్రజల ఆరో గ్యాన్ని పరిరక్షిస్తున్న డ్రైవర్ల జీతాలు ఇవ్వడంలో ఏజెన్సీ కాలయాపన చేయడం తగదని హెచ్చరించారు. కమిషనర్ కార్మికులకు 6 నెలల నుంచి 12 నెలల వరకు జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించు కుంటారని ప్రశ్నించారు. జీతాలు అడిగిన 17 కార్మికులను ఉద్యోగం నుంచి తొలగిస్తానని కమిషనర్ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ సమ్మెలో అబ్దుల్‌దేశాయ్, నరేష్, రఘుశేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రతి ఎమర్జెన్సీ కేసును ఏఎంసీకి పంపొద్దు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 11: ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ కేసులను ఆయా విభాగాల్లోనే చికిత్స అందించాలని, ప్రతి కేసును ఏఎంసీకి పంపొద్దని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. గురువారం కర్నూలు వైద్యకళాశాల న్యూ అధ్యాపకుల హాలులో మరణాలపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. మరణాలపై మెడికల్, గైనిక్, డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన రెండు కేసులపై ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష చేశారు. ఇక నుంచి ఆసుపత్రిలో అత్యవసర రోగుల కోసం ప్రత్యేకంగా కోడ్‌బ్లూ టీంను ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ విధానం విదేశాల్లో అమలులో ఉందని అన్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయిన ప్రతి రోగికి మెరు గైన వైద్యసేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరిటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్ఓడీలు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు అఖిల పక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సీపీఎం కార్యాలయంలో అఖిలపక్ష పార్టీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ 31 రోజుల నుంచి అంగన్‌వాడీ కార్మికులు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టే కలెక్టరేట్ ముట్టడికి అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పి.నిర్మల, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, ఎస్‌యూసీఐ నాయకుడు నాగన్న, టీడీపీ నాయకుడు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సిబ్బంది సహకారంతోనే 5వ ర్యాంకు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ప్రజారోగ్య సిబ్బంది సహకారంతోనే స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా కర్నూలు నగరానికి 5వ ర్యాంకు వచ్చిందని కమిషనర్ భార్గవతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శుభ్రత సర్వేస్వచ్ఛత సర్వేక్షన్-2023లో ప్రకటించిన ర్యాంకుల్లో కర్నూలు నగర జాతీయ స్థాయిలో 32వ ర్యాంకు (గత ఏడాది 55వ ర్యాంకు), రాష్ట్ర స్థాయిలో గతంలో 2వ ర్యాంకు, ప్రస్తుతం 5వ ర్యాంకు (విశాఖ పట్టణం, విజయవాడ, తిరుపతి, గుంటూరు తరువాత) సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోండి

ఓర్వకల్లు, జనవరి 11: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని శకునాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, సర్పంచ్ రాధిక, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఎస్ఐ రాజరెడ్డి పాల్గొన్నారు.

సమ్మె విరమణ

కర్నూలు (ఎడ్యుకేషన్), జనవరి 11: సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం సమ్మె విరమించారు. అనంతరం ఎస్‌ఏస్‌ఏ పీవో డాక్టర్ వేణుగోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. సమ్మె కాలంలో తమకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పీవోను కలిసిన వారిలో చంద్రశేఖర్ రాజు, రమణ, రఫీ, వీరశేఖర్, వెంకట రాముడు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

» మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 11: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె టీడీపీ మేనిఫేస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు నమ్మకం కోల్పోయారని, జగన్‌ను గద్దెదింపేందుకు వారు ఎదురు చూస్తున్నారని అన్నారు. ఉద్యోగులు, అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు తప్ప కొత్తగా చేసిందేమి లేదని ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి టైలర్ నాగరాజు, మాజీ కార్పొరేటర్ సోమన్న, ఖాజాబందె నవాజ్, జనసైన పార్టీ నాయకులు సుధాకర్, రాజు, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కల్లూరు మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఎన్వీ.రామకృష్ణ, జె.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్‌గౌడ్, పీయూ మాదన్న, ఎస్.ఫిరోజ్, కేతూరు మధు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న గౌరు చరిత

గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించాలి

» జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్), జనవరి 11: గర్భిణుల్లో వచ్చే రక్తహీనత, డయాబెటిక్, అధిక రక్తపోటును వైద్యులు త్వరగా గుర్తించి చికిత్స అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.వై.ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు ఆరాటేన్ సంస్థ సహకారంతో మాతృమరణాల తగ్గింపు శిక్షణ కార్యక్రమం ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రమాదకర లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స చేసి వసతులు ఉన్న ఆస్పత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించారు. కర్నూలు జీజీహెచ్ గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రావణి, రత్నకుమారి గర్భిణి సమయంలో వచ్చే జబ్బుల లక్షణాలను వివరించారు. మాతృమరణాలను తగ్గించాలని, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడాలని డాక్టర్ రేఖ సూచించారు. కార్యక్రమంలో ఆర్మాన్ సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ కావ్య, డెమో ప్రమీలమ్మ, డీపీహెచ్ఎన్‌వో ఇందిరా, పీసీపీఎన్‌డీటీ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

గోసేవతో ముక్కోటి దేవతల అనుగ్రహం



గోశాలలో చాగంటి కోటేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న టీజీ భరత్, టీజీ రాజ్యలక్ష్మి

కర్నూలు(కల్చరల్), జనవరి 11: గోసేవ చేసేవారిపై ముక్కోటి దేవతల అనుగ్రహం ఉంటుందని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గురువారం నగర శివారులో గుత్తిరోడ్డులోని శ్రీగాయత్రి గోశా లలో ఏర్పాటు చేసిన సహస్ర గో ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆయన ప్రారం భించారు. ఈకార్యక్రమంలో యువ ప్రజా నాయకుడు టీజీ భరత్, ఆయన తల్లి టీజీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా గాయత్రి గోశాలలో సహస్ర గో ప్రదక్షిణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారంలో ఒకసారైనా గో సేవ చేసేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. గోశాలకు వచ్చిన వారు తమ కు తోచినంత సాయం చేయాలన్నారు. గోశాల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 11: కర్నూలు జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా టీవీ మురళీమోహన్ నాయుడు, కార్యదర్శిగా సౌజన్య, ఉపాధ్యక్షుడిగా డి.విజయభాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా వృత్తి విద్యాధి కారి జమీర్‌బాషా, ఆర్ఐవో గురువయ్యశెట్టిని కలిసి తమ సమస్యలపై వినతిప త్రాన్ని అందజేశారు.

రోడ్డు భద్రతపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 11: కర్నూలు నగరంలో గురువారం నేషనల్ రోడ్డు సేఫ్టీ వీక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో వాహనదారులకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ట్రాఫిక్ ఎస్ఐ అహమ్మద్ హుస్సేన్ హాజరై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబం ధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చునని అన్నారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడు టి.లింగాలరెడ్డి మాట్లాడారు. సెక్రటరీ శ్యామేల్‌పాల్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, లియేఆంథోని, చిన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు: డీపీవో

సి.బెళగల్, జనవరి 11: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) నాగరాజునాయుడు హెచ్చరించారు. గురువారం మండలం లోని గొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు, దేవాలయాలు నిర్మించిన అక్రమ కట్టడాలను పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా డీపీవో నాగరాజునాయుడు మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు గొల్లలదొడ్డి గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించుకున్న రెండు ఇళ్లను, బీరప్ప ఆలయాన్ని కూల్చి వేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, డీఎల్‌పీవో తిమ్మక్క, ఈవోఆర్డీ సందీప్, కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు పీరయ్య, మన్మథవిజయ్ పాల్గొన్నారు.

గొల్లలదొడ్డిలో పోలీసు పికెట్: మండలంలోని గొల్లదొడ్డి గ్రామంలో గురువారం పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. గురువారం గొల్లలదొడ్డి గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో మా ఇళ్లను కూలగొట్టారని గొడవలకు తావివ్వకుండా ముందస్తుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న అధికారులు, పోలీసులు

అడిషనల్ ఎస్పీగా నాగరాజు

కర్నూలు, జనవరి 11: కర్నూలు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా నాగరాజు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అడిషనల్ ఎస్పీ నాగరాజు సొంతూరు తిరుపతి. ఈయన 1989 ఎస్సై బ్యాచ్‌కు చెందినవారు. ఎస్సైగా కడప జిల్లాలో పలు పోలీసు స్టేషన్లలో పని చేశారు. 2000లో సీఐగా పదోన్నతి పొందారు. 2011లో డీఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ, హైదారాబాదు, తాడిపత్రి, ఏసీబీ విభాగాల్లో పని చేశారు. కడప జిల్లా జమ్ములమడుగులో డీఎస్పీ పనిచేస్తూ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై కర్నూలు వచ్చారు. అడిషనల్ ఎస్పీని పలువురు పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎస్పీకి బొకే అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ

సెర్ప్ సిబ్బంది సమ్మె నోటీసు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 11: తమ సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా సెర్ప్ సిబ్బంది సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 23 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు గురువారం డీఆర్‌డీఏ పీడీ సలీం బాషాకి వైయస్సార్ క్రాంతి పథకం జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పే స్కేలు అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెహమన్, రవికుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సంజీవ్‌కుమార్‌కు విశ్వాసం లేదు: మేయర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్‌కు విశ్వాసం లేదని నగర మేయర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై.రామయ్య విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పదవి అనుభవించి ఇప్పుడు విమర్శలు చేస్తారా అని ప్రశ్నించారు. మొన్నటి వరకు వైసీపీ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు సంగతేమిటని అన్నారు. సం జీవ్‌కుమార్ జిల్లాకు చేసిందేమిటని ఆయన ప్రశ్నించారు.

పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలి

సి.బెళగల్, జనవరి 11: పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలని డీఎల్‌పీవో తిమ్మక్క ఈవోఆర్డీ సందీప్‌కు సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలోని బ్యాథోలి, ఇనగండ్ల, సిబెళగల్, క్రిష్ణదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో పరిసరాల శుభ్రంగా ఉండేలా చూడాలని, గ్రామ పంచాయతీల్లో ఇంటి, కొళాయి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే పంచాయతీ అనుమతి లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లు, కొళాయి కనెక్షన్లను తొలగించాలన్నారు.

మైఫర్ కళాశాలలో యూత్ ఫెస్టివల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 11: స్థానిక ఎ.క్యాంపులోని మైఫర్ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యూత్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.రవికుమార్‌రడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో 'కుడారై సేవ'

కర్నూలు(కల్చరల్), జనవరి 11: నగర శివారులో మామిదాలపాడులోని గోదా రంగనాథస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి 'కుడారై సేవ' పూజలను నిర్వహించారు. స్వామివారి తిరునామ అలంకరణలో నైవేద్యాలు సమర్పించి, పూజాదికాలు చేశారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఆధ్వర్యంలో ధనుర్మాసం 27వ రోజు పూజా విశేషాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామి మాట్లాడుతూ ధనుర్మాసంలో గోదా రంగనాథ స్వాములకు నిర్వహించే కుడారై సేవ అత్యంత ప్రాశస్త్యమైందని అన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

● **మాలే బాలయ్య సత్రంలో..** పాతనగరంలోని పెద్దరంగరాజు వీధిలోగల శ్రీ మాలే బాలయ్య సత్రంలో గురువారం కుడారై సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ ఈవో సురేష్ కుమార్ శర్మ, కృష్ణమూర్తి, కశెట్టి చంద్రశేఖర్, సుబ్బారావు, శివ, సీహెచ్ రమేశ్, సౌజన్య, ఇందుమతి, లావణ్య, సరోజ, నందిని పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి

ఓర్వకల్లు, జనవరి 11: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచించినట్లు ఓర్వకల్లు మండలం హుశేనాపురం టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా తెలిపారు. గురువారం మంగళగిరిలో నారా లోకేశ్‌ను మహబూబ్ బాషా కలిసి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. వచ్చే ఎన్ని కల్లో టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని లోకేశ్ కోరారు. టీడీపీ నాయకులు వడ్డె నారాయణ, వలి ఉన్నారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహబూబ్‌బాషా

దుకాణాలకు బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 11: క్రిష్ణానగర్ ఐటీసీ వద్ద నగర పాలక సంస్థ నూతనంగా నిర్మించిన చిరువ్యాపారుల దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. గురువారం కార్పొరేషన్‌లోని పాతకౌన్సిల్ హాలులో కమిషనర్ భార్గవతేజ పర్యవేక్షణలో నిర్వహించిన వేలంలో నలుగురు వ్యాపారులు పాల్గొన్నారు. మొత్తం 29 దుకాణాలకు సంవత్సరానికి రూ.3. 50 లక్షలకు సర్కారువారు పాట ప్రారంభించారు. చివరికి రూ.4.50 లక్షలకు పెద్దన్న దక్కించుకున్నారు. రెవెన్యూ ఆఫీసర్ జునైద్, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఆర్ఐలు మన్సూర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు తాగునీరు, కరెంటు, ర్యాంపు, ఫర్నీచర్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి జవహర్ రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లతో పోలీసు శాఖతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ,తెలంగాణ, తమి ళనాడు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ జి సృజన, డీఆర్ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

కర్నూలు, జనవరి 11: తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో భూపాల నగర్‌కు చెందిన సుమంజలి అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. సుమంజలి భర్త గత పదిహేను రోజుల కింద మృతి చెందాడు. ఈమె కూలీ పని చేస్తూ జీవిస్తోంది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా తన ఇద్దరూ పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, చుట్టుపక్కల అంతా గాలించిన ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

కర్నూలు, జనవరి 11: ఉల్లిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలో కొల్లంపల్లి తండాలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న సారా స్థావరాలపై ట్రైని డీఎస్పీ భావన ఆధ్వర్యంలో ఎస్సై నల్లప్ప, సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. సారా తయారీదారులపై కేసులు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 కేసులు: నగర శివార్లలో సుంకేసుల రోడ్డులో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మంది ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటో డ్రైవర్లు పోలీసులకు చిక్కారు. వీరి వాహనాలు సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

హైకోర్టు తీర్పు హర్షణీయం



మిఠాయి తినిపించుకుంటున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు(అర్బన్), జనవరి 11: టీడీపీ అధినేత చంద్రబాబుకు ఒకేసారి మూడు కేసుల్లో హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ అన్నారు. గురువారం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ప్రాంగణంలో వైసీపీ నేతలు అక్రమంగా బనాయించిన 3 కేసుల్లో ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఒకే సారి మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మిఠా యిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కనుమరుగు కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది హరినాథ చౌదరి , రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాశెట్టి శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం, శంకర్‌సింగ్, మోహన్‌బాబు, సీనియర్ న్యాయవాదులు వెంకట్రావు, మాదన్న పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం



వడ్డె ఓబన్న విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 11: వడ్డె ఓబన్న స్ఫూర్తితో ఉద్యమిద్దామని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 217 జయంతి సందర్భంగా బీసీ భవన్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధిపతిగా పని చేసిన వడ్డె ఓబన్న బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచారని అన్నారు. ప్రభుత్వం ప్రతి ఏటా జనవరి 11న వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేయాలని, ఆయన చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.రామ క్రిష్ణ, గుడ్డేళ్ల చంద్రికమ్మ, సంపంగి, మల్లయ్య, గోవిందరాజులు, వెంకటరాముడు, మంజుల, మద్దిలేటి, రవికుమార్, తిమ్మరాజు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం: ఆకెపోగు

కర్నూలు(అర్బన్), జనవరి 11: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలవడం ఖాయమని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు తలపెట్టిన రా కదిలి రా సభలకు జనం పోటెత్తుతున్నారన్నారు. చంద్రబాబు తలపెట్టిన 'రా..కదలిరా' సభ విజయవంతం కావడంతో వైసీపీ శ్రేణుల్లో వణు కు మొదలైందన్నారు. వైసీపీ ప్రభుత్వం వేధింపుల కారణంగా రాష్ట్రంలోని యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, వారి ఒక్క టీడీపీ ప్రభుత్వం గ్యారెంటీ కల్పిస్తుందన్నారు. వైసీపీ మాఫియాలు లక్షల కోట్ల మేర దోపిడీతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. కర్నూలు రూరల్ మండల అధ్యక్షుడు శివశంకర్‌నాయుడు, మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్ షేక్షావలి, సోఫి బేగ్, భాస్కర్, గిడ్డయ్య గౌడ్ పాల్గొన్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి

కర్నూలు(అర్బన్), జనవరి 11: కురువలకు రాజకీయ పార్టీలు ప్రాధ్యానం ఇవ్వాలని జేఏసీ చైర్మెన్ రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక జేఏసీ కార్యాలయంలో కురువ, మదాసీ, కురవ మదారి పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురువ సామాజిక వర్గం జనాభా తక్కువ ఉందన్న తప్పుడు సర్వే రిపో ర్టులు చూపించి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను కేటాయింపులో కురవ సామాజిక వర్గాన్ని నిర్లక్ష్యానికి గురి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్, తిరుమలేష్, కే.బలరాం, బత్తిన కిరణ్, మహానంది, కురువ పురుషోత్తం, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

దేవనకొండ, జనవరి 11: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం 2023 ను రద్దు చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ రాందాస్ గౌడ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జీఓ 512 వల్ల ఆర్థిక, అంగ బలం వున్న వారిదే భూమి అన్నట్లుగా చట్టం ఉందన్నారు. రాష్ట్రంలో భూతగదాలు, భూ దందాలు, అధికార పార్టీ నాయకులు భూ అక్రమలు పెరిగిపోతున్న క్రమంలో వారికి వత్తాసు పలికేలా భూ హక్కు చట్టం ఉందన్నారు. తక్షణమే భూహక్కు చట్టాన్ని రద్దు చేసి సన్న,చిన్నకారు రైతులను రక్షించాలన్నారు. సమావేశంలో శేకర్ బ్రహ్మయ్యచారి, హుస్సేని, శ్రీనివాసులు ,కిషోర్, పెద్దయ్య పాల్గొన్నారు.

మైనార్టీలకు అవకాశం కల్పించాలి

ఆదోని టౌన్, జనవరి 11 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మైనారిటీలు అధికంగా ఉండే కర్నూలు పట్టణంతో పాటు ఆదోని పట్టణంలో మైనారిటీ నాయకులకు పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని జిల్లా మైనారిటి డిపార్ట్మెంట్ అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహ్మద్ కోరారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ డిపార్ట్‌మెంట్ జాతీయ అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్ ఘర్హిను ఢిల్లీలో కలిసి కోరామని తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కర్నూలు కేంద్రంతో పాటు ఆదోని పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మైనారిటీలను అన్ని పార్టీల వారు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప, ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరామన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్

ఆదోని టౌన్, జనవరి 11 : పట్టణంలోని 10 మంది టీబీ రోగులకు ఉపాధ్యాయుడు నిరంజన్ కుమార్ గురువారం ఒక్కొక్కరికి రూ.1000 విలువ చేసే పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ ప్రధాని టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ రోగులకు ఉచిత పరీక్షలతో పాటు మందులను కూడా అందిస్తామన్నారు. దేశంలో టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించడం కోసం రోగులను దత్తత తీసుకొని ఆరు నెలల పాటు వారికి పౌష్టిక ఆహారం అందించేలా దాతలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలమురళి కృష్ణ, డాక్టర్ అమూల్య, ఎంపీహెచ్ఎస్ బాబురాజు, ఎస్ స్వరూప్ రాజ్‌కుమార్, సిబ్బంది లలితమ్మ, సుబ్బమ్మ బాయి, వీరేష్ పాల్గొన్నారు.

సీఐగా హనుమంతప్ప

ఆస్పరి, జనవరి 11 : సీఐ హనుమంతప్ప గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పరి పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌గా మార్చడంతో తిరుపతిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హనుమంతప్ప పదోన్నతిపై ఆస్పరి పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎటువంటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

ఎంఈఓను విధుల నుంచి తొలగించాలి

మంత్రాలయం, జనవరి 11: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రాలయం ఎంఈఓ మైనుద్దీన్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మంత్రాలయంలో ఆర్యూఎస్ఎఫ్, ఆర్పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రఘునాథ్, రాష్ట్ర కార్యదర్శి అఫ్రీది మాట్లాడుతూ ఎంఈఓ మైనుద్దీన్‌పై డిప్యూటీ డీఈఓ విచారణ జరిపి అవినీతి రుజువైందని ఆరపించారు. ఇందుకు డీఈఓ రంగారెడ్డి మంత్రాలయం ఎంఈఓకు ఒత్తాసు పలుకుతూ కాపాడుకోవటం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం వినూత్నంగా దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శివ, హరి పాల్గొన్నారు.

గణేకల్లులో ఘనంగా దేవర



బంగారమ్మవ్వ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆదోని రూరల్, జనవరి 11 : ఆదోని మండలం గణేకల్లులో బంగారమ్మవ్వ దేవర వైభవంగా జరిగింది. గురువారం మహిళలు కుంభాలతో, కలశాలతో అమ్మవారి దేవాలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. నాయకులు దేవాలయానికి చేరుకొని పూజలు చేశారు.

దేవర వేడుకల్లో నాయకులు

కోసిగి, జనవరి 11: కోసిగి మండలం జుమ్మాలదిన్నె గ్రామంలో గురువారం మారికాంబదేవి దేవర ఘనంగా జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు స్వగ్రామం కావడంతో మీనాక్షినాయుడు, ప్యాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ నాయకులు భారీ తరలివచ్చారు. వీరి వెంట కోసిగి టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్ నాయకులు ఉలిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సురేష్‌నాయుడు, నర్సారెడ్డి, నాడిగేని అయ్యన్న, వక్రాని వెంకటేష్, పంపాపతి, వీరారెడ్డి, భరధ్వాజశెట్టి, ఉమాపతి నాయుడు, మదిర భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు, దేవేంద్రప్ప ఉన్నారు.

మిరప, పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

మంత్రాలయం, జనవరి 11: మిరప, పత్తి పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం, సీపీఐ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్, రైతు సంఘం నాయకులు లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ మిరప, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. పెట్టినపెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశరు. కార్యక్రమంలో మాబుహుస్సేన్, అబ్దుల్, మునిస్వామి, అనిల్, ఈరన్న నాయక్, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని రూరల్, జనవరి 11 : పెద్ద తుంబళం గ్రామానికి చెందిన బసలదొడ్డి పైరయ్య(40) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. మృ తుడి కుటుంబానికి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బసవ రాజ్ దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వ్యక్తి అరెస్టు

ఆదోని రూరల్, జనవరి 11 : ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన బాలుడిని పెద్దతుంబళం పోలీసులు గురువారం గ్రామ శివార్లలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా, అదుపులో తీసుకొని అతని వద్ద నుంచి 100 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ పీరయ్య తెలిపారు.

వైసీపీకి భవిష్యత్తు లేదు: బీవీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

గోనెగండ్ల, జనవరి 11: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి భవిష్యత్తు లేదని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం గోనెగండ్ల జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాయలం నుంచి సంతమార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు జగన్ ప్రభుత్వంలో తీరని అన్యాయం చేశాడని ఆయన అన్నారు. టీడీపీ బీసీల అభివృద్ధి కోసం పాటుపడే పార్టీ అని తెలిపారు. వైసీపీ నాయకులకు ఎమ్మిగనూరులో ఓటమి భయం పట్టుకొని బీసీ పాట పాడుతున్నారని ఆయన విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు చేసే అభివృద్ధి పనులను గురించి వివరించారు. కార్యక్రమంలో సత్రం రామకృష్ణ, సుబాష్‌చంద్ర బోస్, నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, రమేష్‌నాయుడు మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ఎమ్మిగనూరు, జనవరి 11: రాష్ట్రంలో వైసీపీ పని అయిపోయిందని.. జగన్‌ను ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 13వ వార్డుకు చెందిన అబ్దుల్ రహిమాన్, దర్జి వాహిద్, సబ్బీర్, నసీమ్, ఇబ్రహీం, తాహేర్, వాసీమ్, దాదాపీర్‌లతో పాటు 25 ముస్లిం మైనార్టీ కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి ఆయన టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు శాబిర్, మాజీ కౌన్సిలర్లు ముల్లా కలీముల్లా, గుల్లా సలాం, గౌస్, మున్నా, నాయకులు చేనేత మల్లి, సుంద రరాజు, బచ్చాల రంగన్న, భాస్కర్, గాజుల సుధాకర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతో భవిష్యత్

మద్దికెర, జనవరి 11: మాజీ సీఎం చంద్రబాబు మేనిఫెస్టో ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలకు భవిష్యత్ గ్యారెంటీ అని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజినేయులు, మైనార్టీ నాయకులు సాయినగర్ బాషా అన్నారు. గురువారం మద్దికెర గ్రామంలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024 ఎన్నికలలో టీడీపీ విజయం సాధించడం తథ్యం అన్నారు. పత్తికొండలో టీడీపీ జెండా ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త సైన్నికుడిల పనిచేస్తాన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగారాజు, చంద్ర, గిడ్డయ్య, పాల్గొన్నారు.

మోదీతోనే దేశం అభివృద్ధి: కేంద్ర మంత్రి



పగిడిరాయిలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సత్యరాల్

తుగ్గలి, జనవరి 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనేదేశం అభివృద్ధి చెందుతుందని, ప్రతి రాష్ట్రానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కేంద్ర ఆరోగ్య మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పగిడిరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని అక్కడ ఏర్పాటు చేసినస్టాల్స్‌ను పరిశీలించి వ్యవసాయ, ఆరోగ్య శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకం కేంద్ర ప్రబుత్వానివే అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం సంక్షేమ పథకాలు అందిస్తూ ఆధ్యాత్మికంపై దృష్టి పెట్టి ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు హిందూ ధర్మస్థానకు కృషి చేస్తున్నామన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్కడికి చేరుకున్న అంగన్‌వాడీ సిబ్బంది వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందించారు. సంకల్ప యాత్రను ప్రారంభించారు. అనంతరం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివరామ్ గౌడు నివాసంలో బీజేపీ నాయకులతో భేటి అయ్యారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి, తహసీల్దారు రవి, ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ రమావెంకటేష్‌గౌడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివరామ్‌గౌడు, లక్ష్మనస్వామి నాయుడు, సర్పంచు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కురువల సమస్యలు పరిష్కరిస్తా

ఆదోని టౌన్, జనవరి 11: కురువల సమస్యలు పరిష్కరిస్తానని కేంద్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో కురువ సంఘం నాయకులతో కలిసి స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం మాదాసి కురువ, మాదారి కురువ సామాజిక వర్గానికి చెందిన నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తమకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన ఎస్సీ రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని కురువలు ఆరోపించారు. దీంతో మంత్రి స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మదాసి కురువ, మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసెడెంట్, బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్, టీడీపీ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవేంద్రప్ప, రాముడు, నాగరాజు, పరమేష్, వీరేష్, జగదీష్, శివరాజ్ పాల్గొన్నారు.

అరాచక పాలనతో ఇబ్బందులు

ఆలూరు రూరల్, జనవరి 11 : జగన్ రెడ్డి విధ్వంసం, అరాచక పాలనతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అవినీతి, దోపిడీ, దౌర్జన్యాలు, వైఫల్యాలపై గురువారం కోట్ల సుజాతమ్మ గురువారం పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక యువత నిరుద్యోగులుగా మారారని అన్నారు. వైసీపీ నాయకుల అవినీతితో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి పోయినట్లు తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. చంద్రబాబు నిర్వహిస్తున్న రా.. కదలిరా... సభలకు జనం నుంచి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని తెలిపారు.

ట్రాఫిక్ జామ్‌తో భక్తులకు నరకం

● జుమాలదిన్నె-ఉరుకుంద రోడ్డులో స్తంభించిన వాహనాలు
● తీవ్ర ఇబ్బందులు పడిన భక్తులు



ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

కోసిగి, జనవరి 11: గురువారం అమావాస్య కావడంతో గురువారం ఉరుకుందకు భారీగా తరలి వచ్చారు. కర్ణాటక, తెలంగాణ నుంచి పెద్దఎత్తున భక్తులు కోసిగి మండల పరిధిలోని జుమాలదిన్నె గ్రామం మీదుగా భారీగా తరలారు. దీనికితోడు జుమాలదిన్నె గ్రామంలో దేవర ఉండటంతో ఉదయం 10 గంటల నుంచే జుమాలదిన్నె నుంచి ఉరుకుంద వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్‌తో కావడంతో భక్తులు నరకం చూశారు. కౌతాళం, కోసిగి మండలాలకు చెందిన పోలీసులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కొని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, పిల్లలు, వృద్ధులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీటి కోసం మహిళలు రోడ్డుపై వాహనాలను వదిలి పొలాల్లోని బోర్ల దగ్గరకు పరుగులు తీశారు. ఇప్పటికైనా అధికారులు కోసిగి నుంచి ఉరుకుంద వరకు డబుల్ రోడ్డు వేయాలని అధికారులు, నాయకులపైన భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటల తరువాత వాహనాలు ఒక్కొక్కటిగా ట్రాఫిక్ జామ్ నుంచి బయటపడ్డాయి.

మినీ నీటి ట్యాంకు కూల్చివేత



పట్టణంలోని 32 వార్డు లక్ష్మీపేటలో మినీ నీటి ట్యాంకును కూల్చివేసి పక్కకు పెట్టిన దృశ్యం

ఎమ్మిగనూరు, జనవరి 11: ఎమ్మిగనూరు పట్టణంలోని 32వ వార్డు లక్ష్మీపేట ప్రజల దాహార్తి తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మినీ నీటి ట్యాంకును అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు గురువారం కూల్చివేశాడు. గతంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్థానికంగా ఉండే ప్రజల నీటి కష్టాలు తీర్చేందుకు అప్పటి ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి మినీ నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే 32వ వార్డు లక్ష్మీపేట (సంజీవయ్య నగర్ వెళ్లే రహదారిలో)లో సైతం ఓ మినీ నీటి ట్యాంకుతోపాటు బోరును మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆ కాలనీ వాసులకు నీటి కష్టాలు తప్పాయి. స్థానికంగా ఉండే ప్రజలు ప్రధానంగా వేసవి కాలంలో ఆ ట్యాంకు ద్వారా నీటిని వినియోగించుకునేవారు. అయితే ఆ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు తన ఇంటి ముందు ఉందన్న నెపంతో ట్యాంకును కూల్చి వేయించాడు. దీంతో ఆ ప్రాంత ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని వివరణ కోరగా మినీ నీటి ట్యాంకును కూల్చిన విషయం తన దృష్టికి రాలేదన్నారు. మున్సిపల్ ఏఈని, స్థానికంగా ఉండే సచివాలయ సిబ్బందిని పంపి విచారిస్తామన్నారు. నీటి ట్యాంకును కూల్చివేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

బాధ్యతగా వ్యవహరించాలి

పత్తికొండ, జనవరి 11 : ఎన్నికల నిర్వహణలో ఎస్‌వోలు, ఎస్పీవోలు (సెక్టార్ పోలీస్ ఆఫీసర్) పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆర్‌డీఓ రామలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక వెలుగుకార్యాలయం సమావేశ భవనంలో సెక్టార్ ఆఫీసర్ (ఎస్‌వో), సెక్టార్‌పోలీస్‌ఆఫీసర్(ఎస్‌పివో)ల విధుల నిర్వహణ, బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌పీవోలు తమకు కేటాయించిన విధులలో భాగంగా ఆయా పోలింగ్ స్టేషన్ల పరిసర ప్రాంతాలపై పూర్తి సమాచారం సేకరించుకోవాలన్నారు. ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రంలో భద్రతతోపాటు, కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విష్ణుప్రసాద్, సీఐ మురళీమోహన్ పాల్గొన్నారు.



ఆలూరులో వరిగడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఎమ్మిగనూరులో ఐసీడీఎస్ కార్యాలయం ముందు..

హక్కులు సాధించుకుంటాం

ఉద్యమంపై ఎన్ని కుట్రలు పన్నినా... ఉక్కుపాదం మోపినా వెనక్కి తగ్గేదే లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా తాము ఏ మాత్రం భయపడమని చాబోరేవో తేల్చుకుంటామని అంటున్నారు. మరో పక్క విధుల్లోకి రావాలని అధికారులు ఒత్తిడి చేస్తూ ఇళ్లకు నోటీసులు అంటిస్తున్నారు. జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలలో గురువారం 31వ రోజుకు సమ్మె చేరింది. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించమని స్పష్టం చేశారు. సమ్మెకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



ఆదోనిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సీపీఎం మద్దతు

'రా..కదిలిరా'తో వైసీపీకి ఓటమి భయం

- టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 11 : రాష్ట్రంలో కూల్చివేతలు, రద్దులు, దాడులతో మొదలైన జగన్ అవినీతి పాలన అక్రమాలను ప్రజలకు తెలిపేందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు చేపట్టిన 'రా కదిలిరా' బహిరంగ సభలకు ప్రజల నుంచి వస్తున్న స్పందనతో వైసీపీ శ్రేణుల్లో ఓటమి భయం మొదలైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టాక వైసీపీ నాయకులు లక్షల కోట్లు ప్రజాధనం దోపిడీ చేశారని ఆరోపించారు. ఉద్యోగావకాశాలు లేక యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. టీడీపీ వారి భవిష్యత్‌కు గ్యారంటీని ఇస్తుందన్నారు. 2024 ఎన్నికలలో సైకో జగన్‌ను ఇంటికి లేక జైలుకు పంపడం ప్రజలు బాధ్యతగా తీసుకోవాని ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 11: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకుల ను సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఇన్సాఫ్ కమిటీ పట్టణ కార్యదర్శి జబ్బార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొందరు డీలర్లు బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నారన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన

హొళగుంద, జనవరి 11 : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎం, వీవీ ప్యాడ్లపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ హుస్సేన్ సాబ్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాడ్లను ఎలా వినియోగించాలో డెమో చేసి ప్రజలకు చూపించారు. వీటిని బస్టాండ్, మార్కెట్ లాంటి జన సమూహం లాంటి ప్రాంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయని, అంతకుమించి పోటీ చేస్తే రెండో ఈవీఎంను వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు. ఓటర్ వెరిఫైబుల్, పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాడ్) ద్వారా ఎవరికీ ఓటు వేశారో డిస్‌ప్లే అవుతుందని, పేపర్ స్లిప్ కూడా వస్తుందని తెలిపారు. ఆ పేపర్లను భద్రంగా ఉంచి ఆడిట్‌లో లెక్కించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో వీరేష్, నాగరాజు, బసవరాజు, తలారిలు మౌలాలి, ఉమేష్, పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని, జనవరి 11 : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎం తాహేర్ వలి, నాయకులు పులిరాజు డిమాండ్ చేశారు. గురువారం జనసేన పార్టీ బృందం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఆదోని పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తిరుమలరెడ్డి, వెంకటరాముడు, ఎల్లప్ప, నరసన్న, రాకేష్, వెంకటేష్, అయ్యప్ప, రాము, ఖాదర్, శేఖర్, మల్లి, గోవిందు, అజయ్, విగ్నేష్, రమేష్, గోపాల్, వీరు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 11: ఎమ్మిగనూరు పట్టటణ శివార్లలోని బాట మారెమ్మ గుడి సమీపంలో ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న వాహనాలతోపాటు ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ చంద్ర, కానిస్టేబుళ్లు భీరప్ప, గూడు బాషా ఉన్నారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఎమ్మిగనూరు టౌన్ , జనవరి 11: బడికి వెళ్లాల్సిన పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని చైల్డ్‌లేబర్ అధికారి శారద హెచ్చరించారు. గురువారం పోలీసు అధికారులతో కలిసి పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను ఎవరైనా దుకాణాల్లో పనులు చేసేందుకు పెట్టుకుంటే వారిపై చైల్డ్ యాక్ట్ (సెక్షన్14(1)) కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఆమె వెంట సీనియర్ న్యాయవాది దామోదరరెడ్డి, అడ్వకేట్ కుమార లింగమూర్తి, ఏఎస్ఐ కృష్ణానాయక్, హోంగార్డ్ వీరేష్‌లు ఉన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

ఆలూరు, జనవరి 11 : బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మల్లికార్జున అన్నారు. గురువారం బీఎస్పీ కార్యాలయంలో తాలూకా ఇన్‌చార్జి రామలింగ అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ అన్ని స్థానాల్లో పోటీలో ఉంటుందన్నారు. 15న జరిగే పార్టీ అధినేత మాయావతి జన్మ దినోత్సవం దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వనమన్న, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, తాలూకా కార్యదర్శి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ సురేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

వెల్దుర్తి, జనవరి 11: ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం చేస్తామని ఎమ్ఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.విశ్వనాథ్ అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక జాతీయ రహదారి-44 సమీపంలో ఉన్న హోసన్నా మందిరంలో మహాజన సోషలిస్టు పార్టీ (ఎమ్ఎస్‌పీ) నూతన మండల కమిటీ, ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా దేవరాజు, ప్రతినిధిగా రోజో సుధాకర్, మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులుగా దేవదానం, ఎర్రన్నలను ఎన్నుకున్నారు. అంతకుముందు పాతబస్టాండ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుండాల ఈశ్వరయ్య, సుభాష్‌చంద్ర, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు గిడ్డయ్య, మాజీ జడ్పీటీసీ బజయ్య, ఎర్రబజారు, బజారు, మద్దిలేటి, వెంకటరాముడు, శివ, సూర్యచంద్ర, మోష, రామాంజనేయులు, హరి పాల్గొన్నారు.

వర్గీకరణతో దళితుల మధ్య విభేదాలు పెట్టొద్దు

ఆలూరు, జనవరి 11 : ఎస్సీ వర్గీకరణతో దళితుల మధ్య విబేధాలు సృష్టించవద్దని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది అన్నారు. గురువారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మాల మహానాడు నూతన సంవత్సర క్యాలెండర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘ నాయకులు భరత్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రాందాస్, మల్లప్ప, యల్లప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



అగసనూరులో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివళి అర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 11: మండలంలోని బోడబండ గ్రామంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె చిన్న అంజినయ్య, మధు, శివ, అశోక్, రాధాకృష్ణ, అంజినయ్య, కేశన్న పాల్గొన్నారు.

కోసిగి: వడ్డె ఓబన్న 217 జయంతి వేడుకలు మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో వడ్డెర సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలో వడ్డెర సంఘం నాయకులు ఉలిగయ్య, సిద్దయ్య, నాగరాజు, వీరేష్, విశ్వనాథ్, బీమేష్ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పూల మాలతో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.